
# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 52 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | ఆదివారం 13 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 52 13-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-

జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది అపోహ: వెంకయ్య నాయుడు 2 లో..



## త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ?

అమరావతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిఎం చంద్రబాబు, సీఎం రేవంత్ రెడ్డి త్వరలో భేటి కానున్నట్లు సమాచారం. విభజన సమస్యల పరిష్కారం కోసం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమై చర్చలు జరపనున్నట్లు సమాచారం. ఇందుకోసం ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఏపీలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టాక 2024 జులైలో తొలిసారి ఇరువురూ భేటీ అయ్యారు.అప్పట్లో ప్రజాభవన్ లో జరిగిన ఈ సమావేశంలో విభజన సమస్యలపై చర్చలు జరిపారు. విడిపోయి పదేళ్లయినా చట్ట ప్రకారం జరగాల్సిన పంపకాలు పూర్తికాకపోవడంపై ఇరువురు ముఖ్యమంత్రులు దృష్టి సారించినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ

- తరువాయి 2లో..


## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీలు సత్తా చాటాయి
### సీఎం చంద్రబాబు

- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్
- ఫస్టియర్ లో 70 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్ లో 83 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్న సీఎం చంద్రబాబు

అమరావతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో ఇవాళ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతో నిరాడంబరంగా, చెప్పిన సమయానికే ఇంటర్ ఫలితాలను వెలువరించారు. ఫస్టియర్ విద్యార్థుల్లో 70 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, సెకండియర్ విద్యార్థుల్లో 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు

- తరువాయి 2లో..





## ఏపీలో ఈ నెల 15 నుంచి చేపల వేట నిషేధం

అమరావతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో సముద్ర తీర ప్రాంతంలో చేపల వేటను నిషేధిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మత్స్య వనరుల పరిరక్షణలో భాగంగా .. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61 రోజులపాటు సముద్ర తీరంలో చేపల వేటపై నిషేధం విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సాంప్రదాయ నాటు పడవలు మినహా మెకనైజ్డ్, మోటరైజ్డ్ పడవలు సముద్రంలో చేపల వేటకు వెళ్లకూడదని పేర్కొంటూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.



తీర ప్రాంతాల్లో ఉగ్ర దాడులు జరగొచ్చు..

- మిగతా 2లో..

## వనజీవి రామయ్య కన్నుమూత



ఐదు దశాబ్దాలుగా 'కోటి మొక్కలు' నాటిన వనజీవి రామయ్య కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యం విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. చెట్లను పెంచండి అంటూ చిన్న తనం నుంచే ప్రచారం చేస్తూ చెట్లు నాటుతూ సేవ చేసిన వనజీవి రామయ్య అసలు పేరు దరిపల్లి రామయ్య. వనజీవి రామయ్య మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ప్రకృతి ప్రేమికులు, రాజకీయ ప్రముఖులు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి మండలంకు చెందిన రామయ్య కృషిని గుర్తించిన యూనివర్సల్ గ్లోబల్ పీస్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కెన్యాకు చెందిన వంగాయి మాతాయిని స్ఫూర్తిగా తీసుకొని 3కోట్ల మొక్కలు

- తరువాయి 2లో..

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

- ఫలితాలు విడుదల చేసినట్లు ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ ప్రకటన
- ఇంటర్ ఫస్టియర్‌లో 70 శాతం ఉత్తీర్ణత
- సెకండ్ ఇయర్‌లో 83 శాతం ఉత్తీర్ణత

అమరావతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు



విడుదలయ్యాయి. ఫలితాలను విడుదల చేసినట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్‌లో 70 శాతం, సెకండ్ ఇయర్‌లో 83 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రభుత్వ నిర్వహణలోని విద్యా సంస్థలలో ఉత్తీర్ణత పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత శాతం 69 శాతంగా నమోదు కాగా, ఇది గత పదేళ్లలో అత్యధికమని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం విద్యార్థులు, జూనియర్ లెక్చరర్ల కృషికి నిదర్శనం అని పేర్కొన్నారు. ఈసారి పాస్ కానివారు నిరుత్సాహపడకుండా, దీన్ని ఒక మెట్టుగా ఉపయోగించుకొని మరింత కష్టపడి చదవాలని అన్నారు. విద్యార్థులు ఎప్పుడూ పోరాడటాన్ని ఆపకూడదని, విజయం కోసం ప్రయత్నించడంలో తప్పులేదని మంత్రి నారా లోకేశ్ చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు 10 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు హాజరైన విషయం తెలిసిందే.

**ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు**
**-ఇంటర్మీడియట్ ఫలితాలే ఇందుకు నిదర్శనం**


ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ప్రైవేటు కాలేజీలకు ధీటుగా తీర్చిదిద్దుతామనే విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సంకల్పం కార్యరూపం దాలుస్తోంది. విద్యాశాఖ



మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు వచ్చింది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రమాణాల పెంపునకు మంత్రి నారా లోకేష్ తీసుకున్న చర్యలే ఇందుకు కారణం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో గత పదేళ్ల కంటే రికార్డు స్థాయిలో ఈ ఏడాది అత్యధికంగా 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షల్లో గత

- తరువాయి 2లో..

## మే 12 నుంచి ఏపీ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ



అమరావతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మే 12 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబోతున్నట్లు ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మే 12 నుంచి మే 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుంచి జూన్ 1 వరకు జరగనున్నాయి. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష జూన్ 4న, పర్యావరణ విద్య జూన్ 6న నిర్వహించనున్నారు.

## సోనియా, రాహుల్‌కు ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ : నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని ఇడినే ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీ, ముంబై, లక్నోల్లోని ఆస్తులపై నోటీసులు



అతికించినట్లు ఈడీ తన ప్రకటనలో పేర్కొంది. సంబంధిత ఆస్తులను ఖాళీ చేయాలని, లేదా వాటికి వచ్చే అద్దెలను బదిలీ చేయాలని ఆ ప్రకటనలో ఆదేశించింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఇడి పేర్కొంది. తెలిపింది.
నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నల్స్

- తరువాయి 2లో..

## నెల్లూరు జిల్లాలో అమోనియా గ్యాస్ లీక్

**పదిమంది కార్మికులకు అస్వస్థత - భయంతో పరుగులు పెట్టిన మిగతా కార్మికులు**
**టీపీగూడూరు మండలం అనంతపురంలో ఘటన -**
**చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించిన గ్యాస్**

నెల్లూరు ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నెల్లూరు జిల్లాలో అమోనియా గ్యాస్ లీక్ కలకలం సృష్టించింది. టీపీగూడురు మండలం అనంతపురం గ్రామంలోని వాటర్ బేస్ కంపెనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం మధ్యాహ్నం గ్యాస్ లీక్ కావడంతో కార్మికులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఊపిరాడక పది మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. అంబులెన్స్ ల సాయంతో వారిని హుటాహుటిన నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతపురం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకూ గ్యాస్ వ్యాపించిందని స్థానికులు తెలిపారు. దీంతో భయాందోళనకు గురైన ప్రజలు ముందు జాగ్రత్తగా మాస్కులు ధరించారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## మన పంటల విధానం మారాలి !

బియ్యం ఎగుమతులకు తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టింది. ఫిలిప్పీన్స్‌కు తొలివిడత సరఫరా కూడా పూర్తయ్యింది. రాష్ట్ర వ్యవసాయ పురోభివృద్ధిలో ఇదొక మైలురాయి అంటూ ప్రశంసలు కూడా వినవచ్చాయి. నిజంగా ఇదంత సంబరపడాల్సిన పరిణామమేనా? తెలంగాణకు పది కాలాల పాటు లబ్ధి చేకూర్చేదేనా? బియ్యం ఎగుమతుల ద్వారా లభించే తక్షణ లాభాలు ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వవచ్చు. కాని, తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ స్వస్థత, ఆహార భద్రత, పర్యావరణ సుస్థిరత దీర్ఘకాలంలో ప్రమాదంలో పడతాయి. ఫిలిప్పీన్స్ ఇందుకు సరైన నిదర్శనం. అక్కడి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని విశ్లేషణ చేసినట్లయితే, ఇదెంత ప్రమాదకర పరిణామమో విశదమవుతుంది.

వైవిధ్యంతో కూడిన వ్యవసాయ%-%వాతావరణ పరిస్థితులు తెలంగాణ సొంతం. కాబట్టే, ఈ రాష్ట్రం అనాదిగా పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఉద్యాన పంటలకు కేంద్రంగా నిలుస్తూ వచ్చింది. క్రమేణా పరిస్థితి మారింది. విధానాల ఊతంతో వరి సాగు విస్తరించింది. ముఖ్యంగా ధాన్య సేకరణ, సాగునీటి ప్రోత్సాహకాలు రాష్ట్రంలో పంటల సరళిని నాటకీయంగా మార్చేశాయి. తెలంగాణలో వరి సాగు నీటి వనరుల కల్పన మీద విపరీతంగా ఆధారపడి ఉంది. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కమాండ్ ఏరియాల్లో మనం దీన్ని గమనించవచ్చు. ఇప్పటికే భూగర్భ జలాలు క్షీణించిపోతున్న తెలంగాణలో ఇది సుస్థిర సేద్యం కానేకాదు. రాష్ట్రంలో 70 శాతం పైగా జిల్లాల్లో భూగర్భ జలాల వాడకం మితిమీరి ప్రమాదకర స్థాయికి చేరిందని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

నానాటికీ వరి సాగు విస్తరిస్తోంది. 2014%-%15లో 41 లక్షల ఎకరాల్లో వరి పండించగా, 2023%-%24లో ఈ విస్తీర్ణం దాదాపు 50 శాతం పెరిగి 56 లక్షల ఎకరాలకు చేరింది. భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారానే ఈ వృద్ధి సాధ్యపడింది. అయినప్పటికీ, భూగర్భ జలాలు తరిగి పోతున్నాయి. తెలంగాణ స్టేట్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్ మెంట్ ప్రకటించిన 2024 అధ్యయనం ప్రకారం, వరి పండిస్తున్న జిల్లాల్లో భూగర్భ జల మట్టాలు ఏడాదికి 1.2 మీటర్ల వంతున పడిపోతున్నాయి.

ఎగుమతులను ప్రధాన వ్యూహంగా చేసుకుని వాటి మీద ఆధారపడటం శ్రేయస్కరం కాదు. ధరల పతనం, వాణిజ్య ఆంక్షల రిస్కులకు తెలంగాణ రైతాంగాన్నీ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థనూ గురి చేయడం ఎంత వరకు సబబు? ఎగుమతి బియ్యం సేకరణ ధర (టన్నుకు రూ 36,000) ఇప్పుడు లాభసాటిగానే కన బడుతుంది. అంతర్జాతీయంగా గిరాకీ అటూఇటూ అయితే, అమ్ముడుబోని బియ్యం రాష్ట్రంలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతాయి. దేశీయంగా ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకుని ఇండియా 2023లో బాస్మతి యేతర బియ్యం ఎగుమతులపై ఆంక్ష విధించిన విషయం గుర్తు చేసుకోవాలి.

### ఫిలిప్పీన్స్ పాఠాలు

ఫిలిప్పీన్స్ అనుభవం మనకు ఒక హెచ్చరిక లాంటిది. ఆ దేశం ఒకప్పుడు బియ్యం ఎగుమతిదారు. తర్వాత్తర్వాత స్వయంసమృద్ధి మీద సకలశక్తులూ ఒడ్డాల్సి వచ్చింది. పలురకాల పంటల సాగుకు స్వస్తి పలికి అన్ని వనరులనూ వరి సేద్యానికి మళ్లించింది. 2018 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. దేశీయ గిరాకీని తట్టుకునేందుకు 31 లక్షల టన్నుల బియ్యం కొనుగోలు చేసింది. ఆహారభద్రతా సంక్షోభంలో కూరుకుపోయి 2023లో దేశంలో రైస్ ఎమర్జెన్సీ విధించింది. వాతావరణ ప్రతికూలతలు, వాణిజ్య ఆంక్షలు, ధరల హెచ్చుతగ్గులు దేశాన్ని అతలాకుతలం చేశాయి. ఇదంతా వరి పంట మీదే అతిగా ఆధారపడటం వల్ల సంభవించిన బాధాకర పర్యవసానం. ఎగుమతి మార్కెట్లు కుప్పకూలినా, స్థానిక సరఫరాలో కొరత ఏర్పడి ఎగుమతులపై ఆంక్షలు విధించినా... తెలంగాణలోనూ ఇదే పునరావృతం అవుతుంది.

మామిడి, నిమ్మజాతి పండ్ల తోటలకు, పసుపు పంటకు, ఔషధ మెక్కల సాగుకు అనువైన భూములు, వాతావరణ పరిస్థితులు తెలంగాణలో ఉన్నాయి. వీటితో ఉద్యాన పంటలకు ప్రముఖ కేంద్రంగా అవతరించగల సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. నేషనల్ హార్టికల్చర్ బోర్డు గణాంకాల ప్రకారం, ఇండియా సాగుభూమిలో కేవలం 15 శాతమే ఉండే ఉద్యాన పంటలు వ్యవసాయ జీడీపీలో 40 శాతం ఆక్రమి స్తున్నాయి. 2023%-%24లో తెలంగాణ హార్టికల్చర్ ఉత్పత్తి 120 లక్షల టన్నులు. ఈ పంటల కోసం ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి విలువైన తయారీ ఉత్పత్తులను ఎగుమతి చేయగలిగితే ఎంతో ఆదాయం లభిస్తుంది. కాబట్టి, అధిక విలువ కలిగిన హార్టికల్చర్ ఎగుమతుల మీద దృష్టి సారించాలి. తద్వారా వ్యవసాయం సుస్థిర మవుతుంది. అన్నింటి కంటే ముఖ్యమైన మరో అంశం, ఉద్యాన పంటలకు మళ్లడం ద్వారా విలువైన నీటి వనరులను నేల సారాన్ని కాపాడుకోగలం. తెలంగాణ తన వ్యవసాయ విధానంపై పున రాలోచన చేయాలి. భూగోళ వాతావరణ మార్పులు, ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో వాటిని తట్టుకుని దీర్ఘకాలిక సౌభాగ్యానికి బాటలు వేసే సుస్థిరమైన హై వ్యాల్యూ హార్టికల్చర్, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమల దిశగా దృష్టి మళ్లించాలి.

## తీర ప్రాంతాల్లో ఉగ్ర దాడులు జరగొచ్చు..

### నిఘా సంస్థల హెచ్చరిక



దేశంలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా సంస్థలు శనివారం హెచ్చరించాయి. డ్రోన్లు, ఐఈడీలతో దాడులు చేసే అవకాశం ఉందని తెలిపాయి. సముద్ర తీర ప్రాంతాల్లో భద్రత పెంచాలని సూచించాయి. ఈ మేరకు శనివారం కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. సముద్ర మార్గం ద్వారా ఉగ్రవాదులు దేశంలోకి చొరబడే ప్రమాదం ఉందని, తీర ప్రాంతాల్లో బందోబస్తు పెంచాలని సూచించింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేయొచ్చని రైల్వే శాఖను అప్రమత్తం చేసింది. ముంబయి ఉగ్రదాడి కీలక కుట్రదారు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న సమయంలో ఈ అలర్ట్ రావడం గమనార్హం.

## జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది అపోహ: వెంకయ్య నాయుడు

**తిరుపతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది అపోహ అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తిరుపతిలో 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అంశంపై నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతికత సాయంతో జమిలి ఎన్నికలు జరపడం కష్టం కాదని చెప్పారు. కొన్ని పార్టీలు దీన్ని వ్యతిరేకించడంలో రాజకీయ కోణం తప్ప మరేమీ లేదని పేర్కొన్నారు. జమిలి ద్వారా ఎన్నికల ఖర్చు ఆదా అవుతుందన్నారు. అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని, సంయమనం కోల్పోతున్నాయని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి చేటు అని పేర్కొన్నారు. పార్టీ మారే నేతలు పదవికి రాజీనామా చేయాలనే నిబంధన రావాలని వెంకయ్యనాయుడు సూచించారు.



## త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ?

ఇంకా పరిష్కృతం కాని సమస్యలపై తాజాగా మరోమారు భేటీ కావాలని ఏపీ సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ముఖ్యమంత్రుల భేటీకి సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీలు సత్తా చాటాయి సీఎం చంద్రబాబు

స్పందించారు. ఈసారి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులందరికీ హార్దిక శుభాభినందనలు తెలుపుతున్నానని వెల్లడించారు. "ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ఫస్టియర్ లో 47 శాతం, సెకండియర్ లో 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఫస్టియర్ లో 11 శాతం, సెకండియర్ లో 9 శాతం పెరుగుదల నమోదైంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, కేంద్రీకృత మూల్యాంకనం, పర్యవేక్షణ, నూతన సమయపాలన, 100 రోజుల సక్సెస్ కార్యక్రమం, తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు, సంరక్షకుల వ్యవస్థ... ఇలా విద్యా రంగంలో మేము ప్రవేశపెట్టిన సంస్కరణలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి" అని చంద్రబాబు వివరించారు.

## వనజీవి రామయ్య కన్నుమూత

నాటాలని లక్ష్యంగా తీసుకొన్న వనజీవి రామయ్య, జానమ్మ దంపతులు కోటికి పైగా మొక్కలు నాటారు. రామయ్య సేవలను గుర్తించిన కేంద్రం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 2018 లో ఢిల్లీలో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం మన ముందు ఉన్న సవాల్ పర్యావరణ మార్పులను ఎదుర్కోవటమే అని, అందుకు పరిష్కారం ఉన్న అడవులు కాపాడుతూ, కొత్తగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటుతూ పచ్చదనం పెంచటమే అని రామయ్య ప్రజలకు పిలుపునిచ్చి చెట్ల పెంపకానికి ఎంతో కృషి చేశారు.

**వనజీవి రామయ్య మృతిపై చంద్రబాబు సంతాపం**

పద్మశ్రీ వనజీవి రామయ్య ఇక లేరనే వార్త విని తీవ్ర విచారానికి లోనయ్యానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు వనజీవి రామయ్య ఒక్కరే కోటి మొక్కలు నాటడం స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. మొక్కలు నాటుతూ అడవులను సృష్టించిన రామయ్య సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదని విచారం వ్యక్తం చేశారు. నేటి తరానికి రామయ్య ఆదర్శప్రాయుడని, పర్యావరణ పరిరక్షణ విషయంలో ఆయన చేసిన కృషి అసామాన్యమని చెప్పారు. రామయ్య ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వనజీవి రామయ్య కుటుంబానికి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**వనజీవి రామయ్య మృతిపట్ల ఏపీ ఉపముఖ్యమంత్రి సంతాపం**

ఆరు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వనజీవి రామయ్య మరణం తీరని లోటని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వనజీవి మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ట్వీట్ చేశారు. వనజీవి రామయ్య స్ఫూర్తిని కొనసాగిస్తామని పేర్కొన్నారు. 'పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తిని కొనసాగిస్తాం. తన జీవిత కాలంలో సుమారు కోటి మొక్కలు నాటారు. ఆయన కన్నుమూశారని తెలిసి చింతించా. వృక్షో రక్షతి రక్షితః అనే పెద్దల మాటలోని వారసత్వాన్ని ప్రజలకు తెలియజేసేందుకు రామయ్య పడిన తపన సమాజానికి ఎంతో మేలు చేస్తోంది. తొలకరి చినుకులు పడగానే మొక్కలు నాటుతూ, విత్తనాలు జల్లుతూ పచ్చదనం పెంచడానికి రామయ్య, ఆయన సతీమణి చేసిన వనయజ్ఞం ఎన్నో తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందిస్తుంది. ఓసారి ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో ఉన్న రామయ్యను పరామర్శించా. అప్పుడు కూడా ఆయన పర్యావరణ పరిరక్షణపైనే మాట్లాడారు. రామయ్య స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు కృషి చేస్తాం. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తాం" అని పవన్ కళ్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు.

**వనజీవి రామయ్య మృతిపై జగన్ స్పందన**

తన జీవితాన్ని మొక్కల పెంపకానికే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి వనజీవి రామయ్య గుండెపోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై వైసీపీ అధినేత జగన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషి మరువలేనిదని జగన్ ఎక్స్ వేదికగా ప్రశంసించారు. ప్రకృతి ప్రేమికుడు, ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ వనజీవి రామయ్య గారి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని జగన్ అన్నారు. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. కోటి మొక్కలకు పైగా నాటి, పుడమితల్లికి ఆయన అందించిన సేవలు రేపటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రామయ్య ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

## ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదల

పదేళ్లతో పోలిస్తే రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థుల్లో అత్యధికంగా 47 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ, ప్రైవేటు మొత్తంగా ఇంటర్మీడియట్ ఫలితాలు చూసుకుంటే గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో అత్యధికంగా 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. రెండో ఏడాదిలో రికార్డు స్థాయిలో అత్యధికంగా 83 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాల పరంగా చూసుకుంటే ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 34శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లాలో 81 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. అత్యల్పంగా విశాఖపట్నం జిల్లాలో 55 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

**ఒకేషనల్ కోర్సుల్లోను రికార్డు స్థాయి ఫలితాలు**

ఇంటర్మీడియట్ ఒకేషనల్ లోనూ గత పదేళ్లతో పోలిస్తే రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విషయానికి వస్తే ఇంటర్మీడియట్ ఒకేషనల్ మొదటి ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 64శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ రెండో ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 82శాతం ఉత్తీర్ణత నమోదైంది. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. ఫలితంగా రికార్డు స్థాయిలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం పెరిగింది. వైసీపీ హయాంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ రద్దు చేసింది. నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరుతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించారు. అదే విధంగా ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశారు. ఐదేళ్ల తర్వాత 2024 ఏడాదిలో 217 మంది ప్రిన్సిపల్స్ కు ప్రమోషన్లు ఇచ్చారు. 2024 ఏడాది అక్టోబర్ నుంచి సెంట్రలైజ్డ్ అసెస్ మెంట్ చేశారు. అంతర్గత పరీక్షల్లో విద్యార్థుల ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించడంతో పాటు విశ్లేషించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనివేళలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెంచారు. వంద రోజుల కార్యక్రమాన్ని రూపొందించి వెనుకబడిన విద్యార్థులను కేటగిరీలుగా విభజించడంతో పాటు స్టడీ మెటీరియల్ అందించి వారికి వెన్నుదన్నుగా నిలిచారు. మూడు పేరెంట్ టీచర్ మీటింగ్ ల నిర్వహణతో పాటు విద్యార్థులందరికీ ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చారు. జరుగుతున్న సిలబస్ పై వాట్సప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించారు. టేక్ కేర్ వ్యవస్థను ఏర్పాటుచేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలు, అటెండెన్స్ బాధ్యతలను అప్పగించారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఇంటర్ కాలేజీల్లో సంస్కరణలు తీసుకురావడం ద్వారా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది.

## సోనియా, రాహుల్‌కు ఈడీ నోటీసులు

లిమిటెడ్ ప్రచురణకర్తగా ఉంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ సహా కొందరు పార్టీ నేతలు ప్రమోటర్లుగా ఉన్న 'యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్' ఏజేఎల్‌కు యాజమాన్య సంస్థ. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయిపడ్డ రూ.90 కోట్లను వసూలు చేసుకునే విషయంలో 'యంగ్ ఇండియన్'లో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరుపుతోంది. దర్యాప్తులో భాగంగానే 2023 నవంబర్‌లో సంబంధిత స్థిరాస్తులతోపాటు ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో ఉన్న 'యంగ్ ఇండియన్' కు చెందిన రూ.90.21 కోట్లను జప్తు చేసింది. ఈ కేసుకు సంబంధించి సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌లను ఈడీ ఇప్పటికే విచారించింది. వారి స్టేట్‌మెంట్లనూ రికార్డు చేసింది. తాజాగా సంబంధిత స్థిరాస్తుల స్వాధీనానికి నోటీసులు ఇచ్చింది.




# వినేని ఉమా కుమారుడి నిశ్చితార్థానికి హాజరైన సీఎం చంద్రబాబు...


విజయవాడ ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా కుమారుడు నిహార్, నర్మద నిశ్చితార్థ వేడుక ఇవాళ విజయవాడలో ఘనంగా జరిగింది. నగరంలోని ఏ-కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ శుభకార్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. కాబోయే దంపతులకు ఆయన పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుకకు టీడీపీ నేతలు భారీగా తరలివచ్చారు.









# పాస్టర్ ప్రవీణ్ మృతి

» సాంకేతిక, పోస్టుమార్టం నివేదికలతో మృతి ని ధ్రువీకరించిన పోలీసులు
» దర్యాప్తు వివరాలు వెల్లడించిన ఐ జి అశోక్ కుమార్ కుమార్

# ప్రమాదవశాత్తు జరిగినదే..

అమరావతి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల రోడ్డు ప్రమాదం వల్లనే మృతి చెందారని ఏలూరు రేంజి కె అశోక్ కుమార్ తెలిపారు. కేసు ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేక పోలీసు బృందాలతో అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేశా మన్నారు. పాస్టర్ మృతి పై క్రైస్తవ లోకం ఆందోళన లు ,ఉద్యమాలను చేయడం, మీడియా ,సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారాలు చేయడం విధితమే. ఈ సందర్భంగా పలు వూరు కి నోటీసులు ఇవ్వడం, కొందర్నీ అరెస్ట్ చేయడం జరిగింది. పోలీసుల పైన ,ప్రభుత్వం పైన తీవ్ర ఒత్తిడి వచ్చింది. దాంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేసి కేవలం 20 రోజుల్లో కేసును చేదించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో అయన కేసు దర్యాప్తు వివరాలను వెల్లడించారు.

ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి, సుమారు 400 సీసీ ఫుటేజ్ లను పరిశీలించామని, 92 మంది సాక్షులను విచారించమని, వృత్తి నిపుణుల సహాయ, సహకారాలు, సాంకేతిక ,పోస్ట్ మార్తం రిపోర్టులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ప్రమాదం వల్లనే మృతి చెందినట్లు ధ్రువీకరించామన్నారు. హైదరాబాదు లో ఫస్ట్ రేట్ సాఫ్ట్వేర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ , క్రైస్తవ మత బోధకుడిగా వ్యవహరిస్తున్న ప్రవీణ్ కుమార్ పగడాల (46) మార్చి 24వ తేదీన హైదరాబాద్ నుండి రాజమండ్రి కి మోటార్ బైక్ పై బయలుదేరారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి చేరే వరకు మార్గమధ్యలో అనేక మద్యం దుకాణాల్లో మద్యం బాటిల్స్ కొనుగోలు చేసినట్లు సీసీటీవీ ఫుటేజ్ ల ద్వారా తెలిసిందన్నారు. మార్గమధ్యలో పలుచోట్ల మద్యం మత్తులో ప్రమాదాలకు గురి కావడం, పలువురు ప్రజలు, పోలీసులు సహాయ పడడం జరిగిందన్నారు. చాలామంది విశ్రాంతి తీసుకోమని చెప్పినప్పటికీ లెక్కచేయకుండా అదే రోజు రాత్రి రాజమండ్రి వస్తూ గామన్ బ్రిడ్జి స్థానిక కొంతమూరు పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఎండిపోయిన మురికి గుంటలో బైక్ తో సహా పడి అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు ఐజి తెలిపారు. మృతుని బావమరిది శామ్యూల్ వాలేస్ ఫిర్యాదు మేరకు రాజానగరం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామన్నారు. క్రైస్తవ లోకంలో వెలువడుతున్న అనుమానాలను, ఆందోళనను, తప్పుడు ప్రచారాలను నిలువరించడంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఇద్దరు డిఎస్పీలు, ఇద్దరు సిఐలు, ఆరుగురు ఎస్ఐల తో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆరోజు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి , రూరల్ మండలం తాసిల్దార్ తో శవ పంచాయితీ జరిపామని, డాక్టర్ల బృందంతో పోస్టుమార్టంను విడియోగ్రఫీ చేయడం జరిగిందన్నారు. డీఎస్పీలు జి దేవ కుమార్, వై శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో 5 దర్యాప్తు బృందాలు మృతుడు చనిపోయిన స్థలం నుండి అయన హైదరాబాదులో నివసించే ఇంటి వరకు సీసీటీవీ ఫుటేజ్ లను, సాంకేతిక విశ్లేషణలను, 8 టోల్ గేట్ల రాకపోకలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. అంతేకాక జిల్లా ఫింగర్ ప్రింట్స్ యూనిట్, జిల్లా రవాణా అధికారుల బృందం, ఆంధ్రప్రదేశ్ ఫోరోన్సిక్ లాబరేటరీ సైన్స్ లాబరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ తో కూడిన వృత్తి నిపుణుల బృందం నేర స్థలాన్ని, బైకును, అతనికి చెందిన హెల్మెట్ ,కళ్ళజోడు, ఎన్ 95 మాస్కు , నేలపై పడి ఉన్న రక్తపు మరకలను విజయవాడలోని ఆర్ఎఫ్ ఎస్ ఎల్ కు పంపించామన్నారు. మృతుడు ప్రమాదానికి గురైన స్థలములోనూ, ఆ సమయానికి ఆరు కార్లు వెళ్ళాయని , వాటిని జిల్లా రవాణా అధికారి క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. దర్యాప్తులో భాగంగా మృతుని కుటుంబ సభ్యులను, అయన అనుచరులను, నామవరంలో భూమి కొనుగోలుకు సంబంధించిన వ్యక్తులను, మార్గమధ్యలో మద్యం దుకాణాల వారిని, పడిపోయినప్పుడు సహాయం చేసిన వ్యక్తులను, గత రెండేళ్లుగా మృతునితో మాట్లాడిన వ్యక్తులను, చనిపోయే రెండు రోజుల ముందు మాట్లాడిన వ్యక్తులను , మృతుడితో ఇతరులు చేసిన ఫోను సంభాషణలను, మృతుడు గతంలో రాజమండ్రి వచ్చినప్పుడు మాట్లాడిన, కలిసిన వ్యక్తులను, మృతుని వాహనం వెంబడి రాకపోకలు సాగించిన డ్రైవర్లను సుమారు 100 మందిని విచారించామన్నారు. ఈ కేసులో ఇప్పటివరకు దర్యాప్తు చేసిన అన్ని రిపోర్టులు, విచారించిన సాక్ష్యాలు, పరిశీలించిన సిసి ఫుటేజ్ ల ఆధారంగా మృతుడు ఇటీవల రాజమండ్రి నామవరం నందు బైబిల్ కాలేజీ నిర్మాణం చేయు నిమిత్తం 510 గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లుగా తేలిందన్నారు. ఈ భవన నిర్మాణం కోసం కొంతకాలం ఉండేందుకు లాలా చెరువులో ఒక ప్లాట్ ను అద్దెకు తీసుకున్నరని, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో స్థానికంగా తిరగడానికి బైక్ అవసరం అవుతుందని భావించి బైక్ ఉంచడానికి గత మార్చి నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాదులోని తన నివాసం నుంచి బయలుదేరారన్నారు. మార్గమధ్యలో హైదరాబాదులోని సవేరా లిక్కర్ మార్ట్ వద్ద, కోదాడ శ్రీ ఆదిత్య వైన్స్ వద్ద రెండు సార్లు మద్యం కొనడం జరిగిందన్నారు. అంతే కాకుండా చిల్లకల్లు వద్ద, కీసర టోల్ గేటు వద్ద 500 మీటర్ల ముందు ఒకసారి, రామవరప్పాడు రింగ్ వద్ద మరోసారి ఆయన బైక్ తో సహా పడిపోవడం జరిగిందన్నారు. పై మూడు ప్రమాదాల్లో మృతునికి చిన్న, చిన్న గాయాలయ్యాయిని , బైక్ హెడ్ లైట్ పగిలిందని, రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద రోడ్డు పక్కన పార్కులో రెండు గంటల పాటు విశ్రాంతి తీసుకున్నారన్నారు. విశ్రాంతి అనంతరం అక్కడ నుంచి బయలుదేరి మార్గమధ్యలో ఏలూరులో టానిక్ వైన్స్ నందు మద్యం కొనుగోలు చేసి మద్యం సేవించి రాజమండ్రి వస్తున్న ట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆప్పటికే పలుమార్లు మద్యం సేవించి, మద్యం మత్తులో ఉండడం, చాలా దూరం నుండి రాత్రి సమయంలో బైకుకు హెడ్లైట్ లేకుండా కేవలం సిగ్నెలింగ్ లైట్లతో అజాగ్రత్తగా ప్రయాణించడం వల్ల కొవ్వూరు టోల్గేట్ దాటిన 11 నిమిషాలకు పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి బైక్ తో సహా ప్రమాదవశాత్తు ఎండిపోయిన గుంటలో పడిపోవడం వల్ల ప్రమాదవశాత్తు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందినట్లు తేలిందని ఐజి అశోక్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన క్రైస్తవ లోకంలో పలు అనుమానాలు తలెత్తిన పాస్టర్ మృతిపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయడానికి కేవలం 20 రోజుల్లో కొలిక్కి తీసుకు వచ్చిన ప్రత్యేక బృందం కృషిని ఐజి అభినందించారు. చేసిందని ఈ కేసు పై సాక్షాదారాలు ఇంకా ఏమైనా ఉంటే పోలీసు వర్గాలకు అందజేయాలని అంతేగాని మీడియాలను సోషల్ మీడియాలను తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు ఈ సమావేశంలో ఎస్పి నరసింహ కిశోరు, అదనపు ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, ప్రత్యేక బృందం డిఎస్పీలు సీఐలు పాల్గొన్నారు.






డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

ఆదివారం13 ఏప్రిల్ 2025



# అక్రమ కేసులు వెంటనే ఎత్తి వేయాలి

**అంబాజీపేట, ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు మరో ఆరుగురిపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, తాజా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పళ్ల సూర్యప్రకాశరావు (బాబ్జి) డిమాండ్ చేశారు. అంబాజీపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ది అంబాజీపేట జర్నలిస్ట్ అసోసియేషన్ (తాజా) సభ్యులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, బాబ్జిలు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్తో సహా ఆరుగురు పాత్రికేయులపై కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య విలువలకు విఘాతమన్నారు. పల్నాడు జిల్లాలో జరిగిన హత్యోదంతంలో దోషులను శిక్షించాల్సింది పోయి, వార్త కవర్ చేసిన సాక్షి జర్నలిస్టుల పైనా, మీడియాపైనా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. వార్తలో పేర్కొన్న విషయాల్లో నిజానిజాలను ఖరారు చేసుకుని నిందితులపై చర్యలు తీసుకోవడం మాని, పాత్రికేయులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జర్నలిస్టులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సీ ఎన్.మూర్తి, ఐ.పి.కుమార్, మాలే దుర్గా ప్రసాద్, జల్లి విక్టర్ కుమార్, దంగేటి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**సఖినేటిపల్లి ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ అగ్ని ప్రమాదం లో గాయపడిన కారణం గా త్వరగా కోలుకోవాలని సఖినేటిపల్లి లంక శ్రీ ఆంజనేయస్వామి గుడి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేపూరి రాజేశ్వరి యేసు రాజా,సఖినేటిపల్లి లంక ప్రస్తుత గ్రామశాఖ అధ్యక్షులు మార్గాని ఏడుకొండలు, నూతనం గా ఎన్నికైన గ్రామశాఖ అధ్యక్షులు రేపూరి శ్రీనివాస్, సఖినేటిపల్లి మండల ఉపాధ్యక్షులు గునిశెట్టి రామ్ జి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ ముచ్చర్ల వెంకటేష్, సఖినేటిపల్లి మండల ఐటి కోఆర్డినేటర్ కూనపరెడ్డి కూనపరెడ్డి సుధాకర్, గ్రామ ఐటి కోఆర్డినేటర్ అడబాల నాగు, నూతనంగా ఎన్నికైన గ్రామకమిటి సభ్యులు జనసైనికులు వీరమహిళలు అందరు పాల్గొన్నారు.

# చంద్రబాబు మంచి పాలనకు అండగా నిలవండి

**లిరూ 14 కోట్లతో దమయ్యపర్తి మురుగు డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి రామానాయుడు.**



**పాలకొల్లు, ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో మంచి పాలన అందించే కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తులోనూ అండగా నిలవాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు లో రూ 14 కోట్లతో మూడు వేర్వేరు ప్రదేశాల్లో చేపట్టే దమయపర్తి మురుగు డ్రైన్ కాంక్రీట్ గోడ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. దొడ్డిపట్ల రోడ్డు సెంట్ మేరీస్ , పదో వార్డు, నాలుగో వార్డుల్లో జరిగిన శంకుస్థాపన కార్యక్రమాల్లో కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు పూజ జరిపి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా ప్రాంతాల ప్రజలు ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చి దీవించారు. డ్రైన్ పై చేపట్టబోయే పనులను పరిశీలించారు. పనులకు ఆటంకం లేకుండా డ్రైన్ వెంబడి గ్రావెల్ రహదారి నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లుకు దుఃఖదాయనిగా ఉన్న దమయపర్తి డ్రైన్ వలన వర్షాకాలంలో 15 వార్డులు ముంపు లోనే ఉండి వరదలు తలపిస్తున్నాయని దీంతో అవార్డు ప్రజలు ఇబ్బందులు అనుభవిస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తొలిసారిగా ఎమ్మెల్యే గా గెలిచి రూ 6 కోట్లు నిధులు తీసుకువచ్చానన్నారు. ఆ నిధులతో కొంతమేర పనులు చేయగా వైసీపీ నాయకులు అవాంతరాలు, అడ్డంకులు సృష్టించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను పట్టించుకోకపోగా మంజూరైన నిధులు సైతం రద్దయ్యాయి అన్నారు.రాష్ట్రంలో గత ఐదేళ్లు పనికిమాలిన పనిచేయని జగన్ పాలన నడిచిందని అందుకు దమయపర్తి మురుగు డ్రైన్ ఒక ఉదాహరణ అన్నారు. అధికార అహంకారంతో వైసిపి నాయకులు పదవులు అనుభవించేరే గాని కనీసం అర్బస్త సిమెంటు, ఒక రూపాయి పని చేయించలేకపోయారన్నారు. ఎన్నికల ముందు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని డ్రైను పనులకు నిధులు తీసుకువచ్చి పూర్తి చేస్తానని ఇచ్చిన మాట 9 నెలల్లోనే నిలబెట్టుకుంటున్నానని మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, డ్రైనేజీ శాఖ ఎస్ ఈ నాగార్జున, ఈ ఈ సిహెచ్ సత్యనారాయణ, ఏ ఈ ఉదయ్, ఇరిగేషన్ ఈ ఈ నారాయణరావు, కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, పి .రాంబద్ర రాజు,పెచ్చెట్టి బాబు,గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌర్నాయుడు, బోనం చినబాబు, జక్కంపూడి కుమార్, తులా రామలింగేశ్వరరావు, ధనాని శ్రీరామమూర్తి, బత్తుల మేరీ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



**-టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు**
**-ఎస్. యానాంలో జర్నలిస్ట్స్ బీచ్ వాలీబాల్ పోటీలు ప్రారంభం**

**ఉప్పలగుప్తం ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
కీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం పరిరక్షించబడుతుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల వెంకటరమణ (రమణబాబు) అన్నారు. ఎస్. యానాం బీచ్ లో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ ను శనివారం సాయంత్రం రమణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన 9 జట్ల సభ్యులను పరిచయం చేసుకున్నారు. విధి నిర్వహణలో నిత్యం వత్తిడికి గురయ్యే జర్నలిస్టులకు ఇటువంటి పోటీలు ఒక ఆటవిడుపు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఇలా ఒక వేదిక మీదకు వచ్చి వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తుండడం ప్రశంసనీయం అన్నారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓబులం ప్రసాద్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఇలా జర్నలిస్టులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు(సోంబాబు), బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గం టిడిపి పరిశీలకులు బోళ్ళ వెంకటరమణ, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి నాయకులు అయితాబత్తుల రాజశేఖర్, జనసేన నాయకులు పలచోళ్ళ పద్మనాభం, అమలాపురం పట్టణ తెలుగుయువత అధ్యక్షులు నల్లా మల్లిబాబు, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, వివిధ జిల్లాల జర్నలిస్టులు పాల్గొన్నారు.ం





# వైసిపి విష ప్రచారం

**కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉంది**

**టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్**

**అమరావతి, ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా తెలుగుదేశంపై భూమన కరుణాకర్ రెడ్డి తప్పుడు విషప్రచారం చేయటాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. అమరావతిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం వెంకటేశ్వర స్వామి పై అనేక విమర్శలు చేసిన కరుణాకర్ రెడ్డి మరోసారి దుష్టచారానికి తెరలేపారని ఆయన విమర్శించారు. కోటి మంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై కూడా అసత్య ప్రచారం చేస్తూ తెలుగుదేశం ప్రతిష్టకు భంగం కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటు కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమని ఆయన తెలిపారు. గో సంరక్షణ శాఖపై తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు గోవుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపై క్రమం తప్పకుండా సమీక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సహజ మరణం పొందిన ఆవులకు పోస్టుమార్టం చేయడం ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదని ఆయన తెలిపారు కోవిడ్ సమయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రసాదాలను కూడా దారి మళ్ళించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకర్ రెడ్డి ది కాదా? అని ఆయన ప్రశ్నించారు. కరుణాకర్ రెడ్డి అవినీతి అక్రమాలతో టిటిడి ఖజానాను దారి మళ్ళించి కమిషన్లు కొట్టేశారని ఆయన విమర్శించారు. కూటమి తెలుగుదేశం ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాలను మానుకోవాలని పాతర్ల రమేష్ హెచ్చరించారు.

# గోనె సంచులు నాణ్యతలో ఎటువంటి రాజిలేదు

**ఏలూరు ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ధాన్యం కొనుగోలులో భాగంగా, రైతులు ఉపయోగించే గోనె సంచులు నాణ్యతగా ఉండాలని, ఈ విషయంలో ఎటువంటి రాజీలేదని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక గౌతమి సమావేశ మందిరంలో రబీ ధాన్యం కొనుగోలు పై రైస్ మిల్లర్లు,వ్యవసాయ, సివిల్ సప్లైస్,రవాణా,సహకార,మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2024-25 రబీ పంట కాలమునకు సంబంధించి ధాన్యం సేకరణ 02.04.2025 నుండి ప్రారంభమైందనీ, వ్యవసాయ శాఖ వారి అంచనాల ప్రకారం ధాన్యం 3.53 లక్షల మెట్రిక్ టన్నులు, లోగడ ప్రధాన కార్యాలయం ద్వారా ధాన్యం సేకరణ లక్ష్యం 1.50 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్లు తెలిపారు.తదుపరి రైతుల యొక్క శ్రేయస్సు కొరకు జిల్లా క్షేత్ర స్థాయి అధికారుల అభ్యర్ధన మేర 2.00 లక్షల మెట్రిక్ టన్నులుగా పెంచడమైనదన్నారు. సదరు ధాన్యమును నాణ్యత నిబంధన మేరకు మేరకు ధాన్యం కొనుగోలు చేయుటకు ప్రణాళిక సిద్దం చేయడం జరిగిందన్నారు. రబి ధాన్యం సేకరణకు సుమారు 55 లక్షల గోరు సంచులు అవసరత ఉంటుందన్నారు.గోనె సంచులు కూడా రైతులకు అందుజేయుటకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో పెట్టుటకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నిర్దేశించిన రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న గోను సంచుల వివరాలు అందించాలన్నారు. అదేవిధంగా ఎక్కడైనా బాగాలేని గోనెసంచులు తిరస్కరించినప్పుడు సంబంధి వివరాలు తమకు సమర్పించాలన్నారు. ధాన్య%శీ% రవాణాలకు సంబంధించి వాహనాల రిజిస్ట్రేషన్ రెండింతల వేగవంతం చేయాలని రవాణా శాఖ అధికారులు ఆదేశించారు. 22 మండలాలలో సాగు చేసిన ధాన్యం సేకరణ కొరకు ఉన్న ఆర్.ఎస్.కె ల 241 అయితే ఈ 241 ఆర్.ఎస్.కె కేంద్రములను ధాన్యం సేకరణ కోసం తటస్థీకరణ (క్లస్టరింగ్) చేసిన అనంతరం ఉన్న సంఖ్య రైతులు 118 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ 118 ఆర్.ఎస్.కెలకు అనుసంధానం చేసిన 62 ప్రొక్యూర్‌మెంట్ సపోర్టింగ్ ఏజెన్సీలు (%ూూూ%లు) 2024-25 రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం కనీస మద్దతు ధర 'గ్రేడ్-ఎ' రకము క్వింటాళ్ కు రూ.2320/- మరియు 'కామన్' రకము క్వింటాళ్ కు రూ.2300/- చొప్పున నిర్ణయించమైనదన్నారు. అవసరమైన సిబ్బందిని రైతు సేవా కెంద్రములలోని దాన్యం కొనుగోలు ఏజన్సిల ద్వారా నియమించమన్నారు. కావున, రైతులు పండించిన ధాన్యమును కనీస మద్దతు ధరకు ప్రభుత్వం వారు ప్రారంభించిన రైతు సేవా కెంద్రములలోని దాన్యం కొనుగోలు ఏజన్సిల ద్వారా %ఖీూూ% నిభంధనల ప్రకారం విక్రయించుకుని, ప్రభుత్వం వారు నిర్ణయించిన కనిస మద్దతు ధర పొందగలరు మరియు ధాన్యం కొనుగోలునకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహములు ఉన్నా మరియు వారి యొక్క ఫిర్యాదులను చేయుట కొరకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076 మరియు 7569597910) నకు కాల్ చేయవచ్చునని తెలియజేశారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, డీఎస్ఓ ప్రతాపరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, డి శ్రీనివాస్,రైస్ మిల్లర్లు,వ్యవసాయ, సివిల్ సప్లైస్,రవాణా,సహకార,మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్ పోర్ట్‌పై కేంద్ర మంత్రి కీలక ప్రకటన

## భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్: అభివృద్ధి వైపు శరవేగం

అమరావతి, ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ అయిన భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ ఎయిర్‌పోర్ట్ దాదాపు 15 నెలల్లో పూర్తి అయ్యే అవకాశముంది. ప్రధాన మంత్రి చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో నిర్మాణ పనులు దూకుడుగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ మొత్తం రాష్ట్రానికి ఒక మైలురాయిగా మారబోతుంది.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన పనులు అంచనాల కంటే వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 71 శాతం పనులు పూర్తయ్యాయి. ఎయిర్‌పోర్టులో నిర్వహణకు అవసరమైన అనేక మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా రన్‌వే, టర్మినల్, ట్యాక్సీ వే, ఇతర భవనాలు వేగంగా నిర్మాణం జరుపుకుంటున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో కీలకమైన పనులు పూర్తయ్యాయి: రన్‌వే పనులు 97%, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ 72%, టెర్మినల్ నిర్మాణం 60%, ట్యాక్సీ వే 92%, పిటూబి 55%, ఇతర భవనాలు 43% పూర్తయ్యాయి.

### ప్రభుత్వ చర్యలు

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్‌కు మద్దతు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదనంగా శాశ్వత నీటి సరఫరా కోసం “తారక రామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్” ను ప్రారంభించింది. 800 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం 1.7 మెట్రిక్ లీటర్ల నీటిని తాత్కాలికంగా అందిస్తున్నారు, కానీ భవిష్యత్తులో మొత్తం 5 మెట్రిక్ లీటర్ల నీటి అవసరం ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి సమర్థవంతమైన పరిష్కారాలు త్వరలో తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది.

### భవిష్యత్తులో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రభావం

భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయిన తరువాత ఇది ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రధాన కేంద్రంగా మారనుంది. విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాల మధ్య ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ చుట్టుపక్కల ప్రాంతీయ అభివృద్ధికి మలుపు చెలాయిస్తుంది. ఇది 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యంతో పాటు కార్గో రాకపోకలను కూడా పెంచుతుంది. అంతర్జాతీయ విమానాశ్రయం కావటంతో విదేశాలకు కూడా విమానాల రాకపోకలు ప్రారంభమవుతాయి.

### కార్గో సర్వీసులు కూడా అభివృద్ధి చెందుతాయి



ప్రస్తుతం విశాఖ ఎయిర్‌పోర్ట్ నుండి ఏటా 4,400 టన్నుల సరుకు మాత్రమే కార్గో సర్వీసు ద్వారా తరలించబడుతుంది. అయితే భోగాపురం ఎయిర్‌పోర్ట్ ద్వారా ఈ సంఖ్య అద్భుతంగా పెరిగే అవకాశం ఉంది. 24 గంటలు విమాన సేవలు అందుబాటులో ఉండటంతో, రాకపోకలపై ఎలాంటి ఆంక్షలు ఉండవు.రాష్ట్ర ప్రభుత్వం అంకితభావంతో ముందుకు సాగుతోంది భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ నిర్మాణంలో జీఎంఆర్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. జీఎంఆర్ సంస్థ ప్రస్తుతం అన్ని వసతులతో పనులు జరుపుకుంటోంది. భారీ యంత్రాలతో, కార్మికులతో నిర్మాణం వేగంగా సాగిపోతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన నిరంతర పర్యవేక్షణతో ఈ ప్రాజెక్ట్ పనులను ముందుకు తీసుకువెళ్ళుతున్నారు.

### భవిష్యత్ పరిణామాలు

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభమవడం ద్వారా రాష్ట్రం ఆర్థిక పరంగా కూడా మెరుగ్గా ఎదుగుతుంది. అంతర్జాతీయ విమానాలు, కార్గో రాకపోకలు, ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటికీ, ఈ ప్రాజెక్ట్ ఏపీకి కీలకమైన భవిష్యత్తు మార్గాలను తెరవడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి నూతన వాయిదా ఇస్తుంది.

# 260 మందికిపైగా ఉద్యోగులు గోవుల సంరక్షణ చూసుకుంటున్నారు



మంత్రి నారాయణ

అమరావతి, ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పరిధిలోని ఎస్వీ గోశాలలో ఆవుల మరణాలపై వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ప్రచారం చేయడం ద్వారా మత విద్వేషాలను రెచ్చగొట్టి అలజడి సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని ఆక్షేపించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తూ తితిదే ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. తితిదే గోశాలలో 260 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను చూసుకుంటున్నారని చెప్పారు. గోవుల బాగోగులను తితిదే పట్టించుకోవడం లేదని తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు గోశాలలో అధునాతన సదుపాయాలు కల్పించినట్లు నారాయణ తెలిపారు.

# వీరమల్లు ఇంట పెళ్లి వేడుకకు హాజరైన కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ

భీమవరం ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పశ్చిమగోదావరి జిల్లా గౌడ సాధికారత సమితి జిల్లా కన్వీనర్ వీరమల్లు సూర్యచంద్రరావు( సూరిబాబు) సోదరుడు కుమార్తె వివాహ వేడుక సందర్భంగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ హాజరై పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు. అలాగే తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఈ వివాహ వేడుకకు హాజరై పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు.


# గాడి తప్పిన గవర్నర్లకు పెద్ద గుణపాఠం



సుప్రీంకోర్టు తమిళనాడు గవర్నర్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు గాడి తప్పిన గవర్నర్లకు పెద్ద గుణపాఠం. రాజ్యాంగ నిపుణులైన న్యాయమూర్తులు జేబీ పార్థివాలా, ఆర్. మహ దేవన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం తమిళనాడు ప్రభుత్వం తమ గవర్నర్ బాధ్యతా రాహిత్యంపై దాఖలు చేసిన పిటిషనన్‌పై చిర కాలం నిలిచిపోయే తీర్పు ఇచ్చింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఏ నిర్ణయమూ తీసుకోకుండా తన దగ్గరే ఉంచుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. బిల్లులను తొక్కిపట్టడం రాజ్యాంగ నేరం అని దూషించకపోయినా, అది రాజ్యాంగ పరమైన నైతిక చర్య కాదని పెద్ద పదాలు వాడుతూ తమిళనాడు గవర్నర్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేసింది కోర్టు.

ఒక్క తమిళనాడు గవర్నర్ మాత్రమే కాదు. కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒక్కటేమిటి... చాలా రాష్ట్రాల గవర్నర్లు రాజ్యాంగాన్ని అనేకసార్లు అతిక్రమించారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నా, బీజేపీ ఉన్నా గవర్నర్ల రాజ్యాంగ అతిక్రమణ మాత్రం కొనసాగుతూనే ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200... ‘వీలైనంత తొందరగా’ (యాజ్ సూన్ యాజ్ పాజిబుల్) తన దగ్గరకు వచ్చిన శాసనసభ ఆమోదించిన బిల్లులపై సంతకం పెట్టాలని పేర్కొంటోంది. కానీ తమిళ నాడు గవర్నర్ రవి తన దగ్గరకు వచ్చిన బిల్లులపై నెలల తరబడి అసలు ఏ నిర్ణయమూ తీసుకోకుండా తొక్కిపట్టారు. ప్రతిదానికీ కాలపరిమితనేది ఒకటి ఉంటుంది. రాజ్యాంగంలో అక్షరబద్ధం కాలేదనే వంకతో ఇష్టమొచ్చినంత కాలం బిల్లులకు ఆమోదం తెలపకపోతే పాలన ఎలా జరుగుతుంది?

# విశాఖ నుంచి 42 వేసవి ప్రత్యేక రైళ్లు



విశాఖపట్నం ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**వేసవి రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే మరిన్ని ప్రత్యేక రైళ్లను నడిపేందుకు సిద్ధమైంది. విశాఖ- బెంగళూరు, విశాఖపట్నం- తిరుపతి, విశాఖపట్నం- కర్నూలు సిటీ మధ్య మొత్తం 42 వేసవి వీక్లీ ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఏప్రిల్ 13 నుంచి మే నెలాఖరు నుంచి ఈ రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి.**

### విశాఖపట్నం- బెంగళూరు (14)

విశాఖపట్నం- బెంగళూరు (ట్రైన్ నం.08581/08582) ఆది వారం, తిరుగు ప్రయాణంలో సోమవారాల్లో ఈ రైలు అందుబాటులో ఉంటుంది. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడురు, రేణిగుంట, జోలార్‌పేట్, కుప్పం, బంగారుపేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది. 2ఏసీ, 3ఏసీ, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయి.

### విశాఖపట్నం- తిరుపతి (14)

విశాఖపట్నం నుంచి తిరుపతికి (08547) ప్రతి బుధవారం, తిరుగు ప్రయాణంలో (08548) గురువారాల్లో ఈ రైలు అందుబాటులో ఉంటుంది. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, కైకలూరు, గుడివాడ, విజవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట స్టేషన్లలోఆగుతుంది. 2ఏసీ, 3ఏసీ, జనరల్ కోచ్‌లు ఉంటాయి.

### విశాఖ-కర్నూలు సిటీ (14)

ప్రతి మంగళవారం విశాఖ నుంచి కర్నూలు సిటీకి (08545), తిరుగు ప్రయాణంలో బుధవారాల్లో (08546) రైలు అందుబాటులో ఉంటుంది. దువ్వాడ, అనకాపల్లి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, దిగువమెట్ట, నంద్యాల, డోన్ స్టేషన్లలో ఆగుతుంది. 2ఏసీ, 3ఏసీ, జనరల్ కోచ్‌లు ఉంటాయి. ఈ రైళ్లు తేదీల వివరాలు వెల్లడయ్యాయి గానీ, ఏ సమయానికి బయల్దేరతాయనే వివరాలు వెల్లడించలేదు.



# వైభవంగా కోదండరాముడి రథోత్సవం

ఒంటిమిట్ట ఏప్రిల్ 12 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించారు. భజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలోయాత్రికులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# బీజేపీ తమిళనాడు అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్

**బీజేపీ అధ్యక్ష పదవికి నాగేంద్రన్ ఒక్కరి నుంచే నామినేషన్**
**కొత్త అధ్యక్షుడిని ప్రకటించిన కిషన్ రెడ్డి, తరుణ్ చుగ్**
**జయలలిత, పన్నీరుసెల్వం ప్రభుత్వాలలో మంత్రిగా పని చేసిన నాగేంద్రన్**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తమిళనాడు అధ్యక్షుడిగా తిరునల్వేలి శాసనసభ్యుడు నైనార్ నాగేంద్రన్ ఎన్నికయ్యారు. చెన్నైలో జరిగిన పార్టీ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ ఈ ప్రకటన చేశారు. బీజేపీ అధ్యక్ష పదవికి నైనార్ నాగేంద్రన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. వచ్చే సంవత్సరం తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ, అన్నాడీఎంకే పొత్తు పెట్టుకున్నాయి. ఈ సమయంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.



కన్యాకుమారి జిల్లాలోని నాగర్‌కోయిల్ సమీపం వడివీశ్వరంలో 1960లో నాగేంద్రన్ జన్మించారు. ఆయన మొదట అన్నాడీఎంకేలో ఉండగా, ఆ తర్వాత బీజేపీలో చేరారు. 2020 జులై నుంచి ఆయన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో జయలలిత, పన్నీరుసెల్వం ప్రభుత్వాలలో పలు శాఖలకు మంత్రిగా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అన్నాడీఎంకే, బీజేపీల మధ్య సమన్వయం కుదిర్చేందుకు ఆయన కీలక పాత్ర పోషిస్తారని భావించి పార్టీ అధిష్ఠానం ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న అన్నామలైకి జాతీయ స్థాయిలో పదవి లభిస్తుందని ప్రచారం జరుగుతోంది.

## చంద్రుడిపై మానవ వ్యర్థాలు.. మంచి ఐడియా ఇస్తే

# రూ.25 కోట్ల ప్రైజ్ మనీ: నాసా ఆఫర్

**దిల్లీ :చంద్రుడిపై దాగిఉన్న పలు విషయాలను తెలుసుకునేందుకు చాలా దేశాలు ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. దాదాపు 50 సంవత్సరాలుగా అమెరికా అంతరిక్ష సంస్థ నాసా జాబిల్లిపై తమ వ్యోమగాములను పంపుతోంది. దీంతో అక్కడ మానవ వ్యర్థాలు కుప్పగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే నాసా ఓ ఆఫర్‌ను ప్రకటించింది. వాటిని తొలగించేలా లేదా రీసైక్లింగ్ చేసేలా వినూత్న పరిష్కారం చెబితే 3 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.25 కోట్లు) నజరానా అందిస్తామని తెలిపింది.**




నాసా 1969 నుంచి 1972 మధ్యకాలంలో ఆపోలో మిషన్ ద్వారా వ్యోమగాములను చంద్రుడిపై పరిశోధనల కోసం పంపించింది. ఆరుసార్లు విజయవంతంగా మిషన్ల ల్యాండింగ్స్ జరిగాయి. వ్యోమగాములు పరిశోధన కోసం జాబిల్లి నుంచి కొంత నమూనా తీసుకువచ్చాయి. అయితే.. లూనార్ మాడ్యూల్‌లో నిల్వ ఉంచే స్థల పరిమితిని దృష్టిలో ఉంచుకున్న వ్యోమగాములు అనవసరమైన వస్తువులను బయటకు విసిరేసి వచ్చారని నాసా తాజాగా తెలిపింది.

వీటిలో మానవ వ్యర్థాలే అధిక మొత్తంలో ఉన్నట్లు వెల్లడించింది. వీటిని చిన్నచిన్న బ్యాగుల్లో ఉంచి జాబిల్లిపై పడేసి వచ్చారని తెలిపింది. ఇలా మొత్తం 96 సంచుల వ్యర్థాలు చంద్రుడిపై ఉన్నాయి. వాటిని అక్కడినుంచి తొలగించాల్సిన అవసరాన్ని దృష్టిలోపెట్టుకున్న నాసా ఈ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. లూనార్ సైకిల్ ఛాలెంజ్ పేరిట దీన్ని ప్రారంభించింది. వ్యర్థాలను నీరు, శక్తి, ఎరువుగా మార్చేందుకు ఐడియాలు ఇవ్వాలంటూ ఆహ్వానం పలికింది. ఈ ఛాలెంజ్‌లో గెలిచిన వారికి 3 మిలియన్ డాలర్లు అందజేస్తామని ప్రకటించింది.

చంద్రుడిపైనే కాక అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు తాము ఉపయోగించిన వస్తువులను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ వినియోగిస్తుంటారు. అక్కడ ఉండే మానవ సంబంధిత వ్యర్థాలను నిర్మూలించాలన్నా, తిరిగి భూమిపైకి తీసుకురావాలన్నా సవాళ్లతో కూడుకున్న అంశం. ఈ కోణంలోనూ ఆలోచించిన నాసా తాజాగా ప్రకటన చేసింది. భవిష్యత్తులో చందమామ పైకి మానవులను తీసుకెళ్లడం.. అక్కడ వారి జీవన విధానాన్ని మెరుగుపరచడంలో ఇప్పుడు ఇచ్చే ఐడియా ఎంతో కీలకమవ్వనున్నట్లు తెలుస్తోంది.

## చరిత్రలో తొలిసారి.. గవర్నర్ వద్ద

# పెండింగ్‌లో ఉన్న బిల్లులు చట్టాలుగా..

**తమిళనాడు : పెండింగ్ బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన వేళ.. తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం 10 చట్టాలను నోటిపై చేసింది. ఈమేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది.**



శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవికి పంపగా ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లుల్ని సమ్మతించకపోవడం, పునఃపరిశీలించాలని సూచిస్తూ వెనక్కి కూడా పంపడం లేదని తెలిపింది. రెండోసారి ఆమోదించిన బిల్లుల విషయంలోను ఆయన తీరు మార లేదంటూ పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంపై ఇటీవల సుప్రీం తీర్పు వెలువరించింది.

తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని మంగళవారం పేర్కొంది. "గవర్నర్ 10 బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి పెట్టడం న్యాయ సమ్మతం కాని ఏకపక్ష చర్య. అందుకే ఆ చర్యను తోసిపుచ్చుతున్నాం" అని జస్టిస్ జె.బి.పర్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని స్పష్టంచేసింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. ఒకవేళ మంత్రిమండలి సలహా లేకుండా గవర్నర్ బిల్లు ఆమోదాన్ని నిలిపి ఉంచాలని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా అలాంటి బిల్లును శాసనసభకు తిరిగి పంపాలని సూచించింది. గవర్నర్ ఈ కాల నిర్దేశాన్ని పాటించనిపక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రి మండలి సలహా మేరకు తప్పనిసరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోందని తెలిపింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమని తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించిన

## ముస్లింల ఓటు బ్యాంకు కోసం
# దుష్ప్రచారం చేస్తున్నారు: పురందేశ్వరి

**అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారని మోదీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారన్న పురందేశ్వరి**
**కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగానికి ఎక్కువ సార్లు సవరణలు జరిగాయని విమర్శ**
**అంబేద్కర్ ను గతంలో కాంగ్రెస్ అవమానించిందని మండిపాటు**



ముస్లింల ఓటు బ్యాంకు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి మండిపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తారంటూ మోదీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగానికి ఎక్కువ సార్లు సవరణలు జరిగాయని తెలిపారు. బీజేపీ హయాంలో 22 సార్లు సవరణలు చేశారని... ఇవన్నీ వివిధ వర్గాల అభ్యున్నతికి దోహదం చేసేవని చెప్పారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఈరోజు అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న బూత్ లెవెల్ లో పలు కార్యాక్రమాలను చేపడుతున్నామని పురందేశ్వరి వెల్లడించారు. అంబేద్కర్ కు సరైన గౌరవం ఇచ్చింది బీజేపీనే అని చెప్పారు. అంబేద్కర్ ను గతంలో అవమానించి ఆయన రాజీనామా చేసేలా చేసిన చరిత్ర ఎవరిదో అందరికీ తెలుసని అన్నారు. అంబేద్కర్ నివాసాన్ని అభివృద్ధి చేసింది కూడా బీజేపీనే అని చెప్పారు. భారత రాజ్యాంగం వల్లే బీసీ అయిన తాను ప్రధాని అయ్యానని మోదీ చెప్పారని గుర్తు చేశారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఇలాంటి అంశాలపై పరిజ్ఞానం పెంచుకుని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, దయాకర్ రెడ్డి, గుడిసె దేవానంద్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ల నుంచి రాష్ట్రపతికి బిల్లుల అంశం..

## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**తమిళనాడు : రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్లు పంపే బిల్లులను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గడువు నిర్దేశిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈతరహా తీర్పు చెప్పడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.**

తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. ఒకవేళ మంత్రి మండలి సలహా లేకుండా గవర్నర్ బిల్లు ఆమోదాన్ని నిలిపి ఉంచాలని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా అలాంటి బిల్లును శాసనసభకు తిరిగి పంపాలని సూచించింది. గవర్నర్ ఈ కాల నిర్దేశాన్ని పాటించని పక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రి మండలి సలహా సూచనల మేరకు తప్పనిసరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోందని తెలిపింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది.

# దిల్లీలో దుమ్ము తుపాను..

## విమాన ప్రయాణికులకు 12 గంటలపాటు ఇక్కట్లు




**దిల్లీ : ప్రతీకూల వాతావరణం కారణంగా దిల్లీ విమానాశ్రయం లో శుక్రవారం పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అక్కడ ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడ్డారు. పలువురు విమాన ప్రయాణికులు ఎక్స్ వేదికగా తమ ఆవేదనను వ్యక్తంచేశారు.**

దేశ రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో దుమ్ము తుపానుతో పాటు మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీని కారణంగా కొన్నిచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఈక్రమంలోనే బలమైన ఈదురుగాలులు వీయడంతో దాదాపు 15 విమానాలను దారి మళ్లించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా, ఇండిగో విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. విమానాల రాకపోకల ఆలస్యం కారణంగా ఎయిర్‌పోర్టులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 12 గంటలుగా విమానాశ్రయంలోనే వేచి చూసినట్లు ఒక మహిళ పేర్కొన్నారు. 'ముంబయికి వెళ్లేందుకు దిల్లీ విమానాశ్రయానికి వచ్చాం. ఉదయం 12 గంటలకు బుక్ చేసుకున్న విమానం కాకుండా మరొకటి ఎక్కాలని అధికారులు సూచించారు. అదికాస్త ఎక్కాక అందులోనే 4 గంటల పాటు కూర్చోబెట్టి తర్వాత దింపేశారు' అని ఒక ప్రయాణికుడు వార్తా సంస్థతో తెలిపారు. ఇక, పలువురు ప్రయాణికులు ఎక్స్ వేదికగా ఆవేదనను వ్యక్తంచేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం అయి ఉండి సరైన సమాచారం ఇవ్వకపోవడంపై ఒక ప్రయాణికుడు ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ధోనీ ఔట్ కాదా?

## థర్డ్ అంపైర్ నిర్ణయం వివాదాస్పదం !

ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు వరుసగా ఐదో ఓటమి. ధోనీ నాయకత్వం చేపట్టినా ఆ జట్టు పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అలవోకగా విజయం సాధించింది. అయితే, ధోనీ ఔట్ నిర్ణయం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. స్పష్టంగా చూడకుండానే ఔట్ ఎలా ఇస్తారంటూ సీఎస్కే అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.




**చెన్నై ఢమాల్**

ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధోనీ 4 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగు మాత్రమే చేశాడు. సునీల్ నరైన్ బౌలింగ్‌లో ఎల్బీగా ఔటయ్యాడు. కోల్‌కతా అప్పీలు చేయగానే ఫీల్డ్ అంపైర్ ఔట్ ఇచ్చాడు. వెంటనే ధోనీ రివ్యూకి వెళ్లిపోయాడు. సాధారణంగా ధోనీ సమీక్షకు వెళ్లాడంటే కచ్చితంగా సానుకూల నిర్ణయం వస్తుందనేది ఫ్యాన్స్ అభిప్రాయం. ఈసారి మాత్రం మరోలా రావడం.. అదీనూ తప్పిదం కావడంతో నెట్టింట విమర్శలకు తెరలేసింది. సమీక్షలో బంతి బ్యాట్ అంచును తాకినట్లు కొంచెం 'స్పైక్స్' కనిపించాయి. కానీ, థర్డ్ అంపైర్ మాత్రం 'ఔట్' ఇచ్చేశాడు. ఈ నిర్ణయంపై మాజీ క్రికెటర్ మార్క్ బౌచర్ కూడా ఆశ్చర్యపోయాడు. "నేను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నప్పుడే ఈ నిర్ణయం రావడంతో కాస్త ఆశ్చర్యానికి గురయ్యా. అల్ట్రాఎడ్జ్‌లో వచ్చిన స్పైక్స్‌ను థర్డ్ అంపైర్ పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. బ్యాట్‌కు బంతి చాలా దగ్గరగా వెళ్లినట్లుంది. అయితే, థర్డ్ అంపైర్స్‌కు కొన్ని కొలమానాలు ఉంటాయని చెప్పడం జరిగింది. మనకు అక్కడ కాస్త స్పైక్స్ కనిపించాయి. కానీ, థర్డ్ అంపైర్ ఎన్నో ఫ్యాక్టర్స్‌ను పరిశీలించినట్లు ఉంది. స్పైక్స్ ఎలా వచ్చింది? చిన్నదా? పెద్దదా? అనేది కూడా గమనించి ఉండొచ్చు. పాదం కదలిక జరిగినప్పుడూ స్పైక్స్ వస్తుంటాయని నిపుణుల మాట" అని బౌచర్ వ్యాఖ్యానించాడు.

# లఖ్‌నవూతో మ్యాచ్..

## గుజరాత్ ఆల్‌రౌండర్ టోర్నీకి దూరం

**ఐపీఎల్ 2025 టోర్నీ మొదటి సగం ముగింపు దశకు చేరుకుంటుంది. ఇప్పటికే పలు జట్లు ఐదేసి మ్యాచ్‌లు ఆడేశాయి. ఇప్పుడు గుజరాత్ టైటాన్స్ ఆరో మ్యాచ్ కోసం సన్నద్ధమవుతోంది. ఈక్రమంలో మరో కీలక ప్లేయర్‌ను గుజరాత్ కోల్పోయింది. మైదానంలో చురుగ్గా ఉండే గ్లెన్ ఫిలిప్స్ సన్‌రైజర్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు. ఆ తర్వాత స్కానింగ్ తీయగా గజ్జల్లో గాయమైనట్లు తేలింది. దీంతో మిగతా మ్యాచుల్లో ఆడటం కష్టమనే ఉద్దేశంతో టోర్నీకే దూరమయ్యాడు. "గ్లెన్ ఫిలిప్స్ త్వరగా కోలుకోవాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది" అని గుజరాత్ టైటాన్స్ పోస్టు చేసింది. గత సీజన్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ ఆటకు దూరమైన సంగతి తెలిసిందే. ఫీల్డింగ్ చేస్తూనే తీవ్రంగా గాయపడటంతో చాలాకాలం పాటు మైదానంలోకి దిగలేదు.**




### ఇప్పటికే రబాడ దూరం..

ఐదు మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించిన గుజరాత్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అన్ని విభాగాల్లో రాణిస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. ఇవాళ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తలపడేందుకు సిద్ధమైంది. ఈ సమయంలో కీలక పేసర్ కగిసో రబాడ కూడా జట్టుకు దూరమయ్యాడు. ఇప్పటికే సిరాజ్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణతో కూడిన పేస్ దళం నాణ్యమైన ప్రదర్శన చేస్తోంది.

### లఖ్‌నవూ గెలిస్తే అగ్రస్థానంలోకి..

గుజరాత్ టైటాన్స్‌పై లఖ్‌నవూ గెలిస్తే పాయింట్ల పట్టికలో తొలి స్థానానికి దూసుకొచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐదు మ్యాచుల్లో మూడు విజయాలు సాధించింది. ఆరు పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఇప్పుడు విజయం సాధిస్తే లఖ్‌నవూ ఖాతాలోకి 8 పాయింట్లు అవుతాయి. మెరుగైన రన్‌రేట్‌ను సాధిస్తే లఖ్‌నవూనే అగ్రస్థానంలోకి దూసుకెళు ్తుంది.

# చెన్నై.. ఇంత ఘోరమా!



14 మ్యాచ్‌లు.. 4 విజయాలు.. 10 ఓటములు.. 2022 ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ ప్రదర్శన ఇది. ఆ జట్టు చరిత్రలో అంత ఘోరంగా ఎప్పుడూ ఆడింది లేదు. ఈ సీజన్లో అంతే దారుణంగా ఆడుతోంది ఈ మాజీ ఛాంపియన్. అయిదుసార్లు టైటిల్ గెలవడమే కాక ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా కొనసాగుతున్న సీఎస్కే.. ఈ సీజన్‌ను విజయంతో ఆరంభించగానే టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా పరిగణించారు విశ్లేషకులు. కానీ ఆ తర్వాత ఆ జట్టు గెలుపు రుచే చూడలేదు. ఈసారైనా గెలుస్తుందని అభిమానులు ఎదురు చూస్తున్నారు కానీ.. నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. గాయపడ్డ రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ధోని పగ్గాలందుకోవడంతో జట్టు మారుతుందని ఆశిస్తే.. ప్రదర్శన ఇంకా తీసికట్టుగా తయారైంది. సీఎస్కేకు కంచుకోట లాంటి చెపాక్‌లో వరుసగా మూడు ఓటములంటే అసామాన్యమైన విషయం. ఐపీఎల్ చరిత్రలోనే బంతుల పరంగా అతి పెద్ద ఓటమిని ఎదుర్కొందా జట్టు. జట్టంతా కలిసి వంద పరుగులు చేయడానికి కూడా ఆపసోపాలు పడడం అంటే ఆ జట్టెంత దయనీయ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక చెన్నై పుంజుకుని ప్లేఆఫ్స్ చేరుతుందనే ఆశలు లేనట్లే. మిగతా మ్యాచ్‌ల్లో మెరుగ్గా ఆడి టోర్నీని గౌరవప్రదంగా ముగిస్తే చాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి కెప్టెన్ మహిమల్లీ ఒకప్పటిలా మ్యాజిక్ చేయగలడా? అతడికి జట్టు

# భీకర ఫామ్‌లో ఉన్న ప్లేయర్ దూరం!

## కారణం తెలిస్తే.. అయ్యో పాపం అంటారు!



**ఈ ఐపీఎల్ సీజన్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ మిచెల్ మార్ష్, వ్యక్తిగత కారణాల వల్ల గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని కుమార్తె అనారోగ్యంతో ఉన్నట్లు లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ వెల్లడించాడు. మార్ష్ లేకపోవడం లక్నోకు పెద్ద నష్టమని, పవర్ ప్లేలో వారి ప్రదర్శనపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.**

ఈ ఐపీఎల్ సీజన్‌లో కొంతమంది ఆటగాళ్లు సూపర్ ఫామ్‌తో పరుగుల వరద పారిస్తున్నారు. అలా ఆడుతున్న వారిలో ఓ ప్లేయర్ తాజాగా ఓ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. అతను మరెవరో కాదు ఆసీస్ ప్లేయర్ మిచెల్ మార్ష్. లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతూ.. భీకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను వన్‌సైడ్ చేస్తున్న మార్ష్.. శనివారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరం అయ్యాడు. అతను లేకుండానే ఎల్ఎస్‌జీ బరిలోకి దిగుతోంది. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.

పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ తెలిపాడు. వ్యక్తిగత కారణాలతో మిచెల్ మార్ష్ ఈ మ్యాచ్ ఆడటం లేదని చెప్పాడు. అతని కూతురు అనారోగ్యానికి గురవ్వడంతో మిచెల్ మార్ష్ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడని వెల్లడించాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. చూడటానికి పిచ్ బాగుంది. గత రెండు మ్యాచ్‌లు గెలవడం హ్యాపీగా ఉంది. ఓ జట్టుగా మా ప్రాసెస్‌పై ఫోకస్ పెట్టాం. ప్రతీ ఆటగాడు అద్భుతంగా ఆడుతున్నాడు. బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నారు. మా విజయాల క్రెడిట్ వారిదే.

ఈ మ్యాచ్‌కు మిచెల్ మార్ష్ దూరమయ్యాడు. అతని స్థానంలో హిమ్మత్ సింగ్ జట్టులోకి వచ్చాడు. మిచెల్ మార్ష్ కూతురు అనారోగ్యానికి గురైంది.'అని రిషబ్ పంత్ చెప్పుకొచ్చాడు. కాగా మిచెల్ మార్ష్ లేకపోవడం కచ్చితంగా లక్నోకు కాస్త ఇబ్బంది కరమైన అంశమే అని చెప్పాలి. ఎందుకంటే.. మార్ష్ సూపర్ బ్యాటింగ్‌తో లక్నోకు మంచి స్టార్ట్ ఇస్తున్నాడు. మరి అతను లేకపోతే.. లక్నో పవర్ ప్లేలో ఎలా ఆడుతుందో చూడాలి.

## ధోనిపై టీమిండియా మాజీ క్రికెటర్ హాట్ కామెంట్స్..





ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉన్నప్పటికీ దారుణమైన ఓటమిని చవిచూసింది. శుక్రవారం చెన్నైలోని చిదంబరం స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో చెన్నై 8 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మిగిలిన బంతుల పరంగా ఇది చెన్నై సూపర్ కింగ్స్ ఐపీఎల్ చరిత్రలో చవిచూసిన అతిపెద్ద ఓటమిగా నిలిచింది. ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ధోని చెన్నై సేన 20 ఓవర్లలో కేవలం 103/9 స్కోరుకే పరిమితమైంది. అయితే డిఫెండింగ్ ఛాంపియన్స్ అయిన ఈ లక్ష్యాన్ని కేవలం 10.1 ఓవర్లలోనే ఛేధించడం విశేషం. దీంతో CSK జట్టు ఆరు మ్యాచ్‌లలో ఐదవ ఓటమిని నమోదు చేసుకుని పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానానికి పడిపోయింది. అలాగే %జూఖ%కి ఇది తమ హోం గ్రౌండ్ అయిన చెపాక్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లలో ఓటమి నమోదు కావడం కూడా ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

ఈ ఘోర ఓటమి తర్వాత, భారత మాజీ క్రికెటర్, ధోనితో కలిసి ఆడిన మనోజ్ తివారీ తీవ్ర విమర్శలు చేశారు. "చెన్నై సూపర్ కింగ్స్ బండి ఇక దిగజారుతున్నట్టు కనిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలోనూ ఇదే ధోరణి కనిపించింది. అనుభవజ్ఞులైన ఆటగాళ్ల షాట్ ఎంపిక చూస్తే ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు," అంటూ తివారీ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా, పర్పుల్ క్యాప్ విజేత అయిన నూర్ అహ్మద్‌ను ఎనిమిదవ ఓవర్ దాకా బౌలింగ్‌కు తీసుకురాకపోవడంపై ప్రశ్నలు చేశారు. "సునీల్ నరైన్‌కు మొదటి బంతిలోనే వికెట్ పడింది. అప్పుడు ప్రత్యర్థి స్పిన్నర్లు ప్రభావితం చేస్తుంటే, మీ బౌలింగ్ స్టార్‌ను ముందే ఎందుకు తీసుకురాలేదు? ఇది సాధారణ క్రికెట్ సెన్స్. సాధారణంగా ధోని ఇలాంటి తప్పు చేయడు," అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఇంతలో ఆయన మరో విమర్శ చేస్తూ, "ఒకవేళ మీ వద్ద ధోనిలాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు ఉంటే, అశ్విన్ బౌలింగ్‌లో ఎడమచేతివాటం బ్యాటర్లు ఉన్నా అతను స్టంప్స్ మీదుగా బౌలింగ్ చేయడం ఎలా సబబు? ఉంకా కహి నా కహి దిమాగ్ నహి చల్ రహా హై క్యా?" అంటూ ప్రశ్నించారు. ఇది కేవలం ఓ ఆటలో ఓటమి కాదు, ఇది అనుభవజ్ఞులైన ఆటగాళ్ల వ్యూహాలపై ప్రశ్నలు తలెత్తించేదిగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.

మ్యాచ్ విషయానికి వస్తే, కోల్‌కతా నైట్ రైడర్స్ విజయానికి కారణం సునీల్ నరైన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన. మొదట బౌలింగ్‌తో 3 వికెట్లు తీసి చెన్నైని 103/9 స్కోరుకే పరిమితం చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మిడిల్ ఓవర్లలో కీలక వికెట్లు తీసి చెన్నై బ్యాటర్లను కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్‌లోనూ దూకుడుగా ఆడి 19 బంతుల్లో 44 పరుగులు చేసి, రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లతో KKR లక్ష్యాన్ని చేరుకునే మార్గాన్ని సులభం చేశాడు. అతనితో పాటు డి కాక్, కెప్టెన్ అజింక్య రహానె కూడా అవసరమైన భాగస్వామ్యాలు చేసి మ్యాచ్‌ను కేవలం 10.1 ఓవర్లలో ముగించారు. చివర్లో రింకు సింగ్ (15లి) అద్భుతమైన సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించి, KKRకి ఈ సీజన్‌లో మూడవ విజయాన్ని అందించాడు. ఈ విజయం ద్వారా %ఖఖ=% నికర రన్‌రేట్‌ను మెరుగుపరచడంతో పాటు పాయింట్ల పట్టికలో మూడవ స్థానానికి చేరుకుంది. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం తమ పాత గ్లోరీని కోల్పోతూ, అనుభవజ్ఞులున్నా ఎందుకు ఇలాంటివి జరుగుతున్నాయన్న ప్రశ్నలతో అల్లాడుతోంది. తమ వ్యూహాల్లో మార్పు చేసుకోకపోతే ఈ సీజన్ గందరగోళంగా ముగిసే అవకాశం ఉందని స్పష్టమవుతోంది.

# జాన్వీ కపూర్‌కు కాస్ట్లీ గిఫ్ట్... ఎవరిచ్చారంటే..!

**బాలీవుడ్ బ్యూటీకి కానుకగా రూ. 5 కోట్ల విలువైన లంబోర్ఘిని కారు**
**జాన్వీకి కాస్ట్లీ గిఫ్ట్ ఇచ్చిన బిర్లా వారసురాలు అనన్య బిర్లా**
**ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్**



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కాస్ట్లీ గిఫ్ట్ అందుకున్నారు. సుమారు రూ. 5 కోట్ల విలువైన లంబోర్ఘిని కారును ఆమె కానుకగా అందుకోవడం విశేషం. ఇంతకీ జాన్వీకు ఇంతంటి విలువైన బహుమతి ఇచ్చింది ఎవరో తెలుసా! బిర్లా వారసురాలు, ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా కూతురు అనన్య బిర్లా. జాన్వీ కపూర్, అనన్య బిర్లా చాలా కాలంగా మంచి స్నేహితులు. ఇటీవల అనన్య బ్యూటీ ప్రొడక్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. అయితే, ఈ బ్రాండ్‌కు జాన్వీ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. తన బ్యూటీ ప్రొడక్ట్స్ బ్రాండ్ కు జాన్వీ సహకరిస్తున్నందుకు కానుకగా అనన్య ఈ ఖరీదైన లంబోర్ఘిని కారును ఆమెకు గిఫ్ట్‌గా పంపించారని సమాచారం. శుక్రవారం ఉదయం లిలాక్ (పర్పుల్) రంగు లంబోర్ఘిని కారు జాన్వీ నివాసానికి చేరుకుంది. ఈ కారుతో పాటు మరో గిఫ్ట్ ప్యాక్ కూడా ఉంది. దానిపై "ప్రేమతో, నీ అనన్య" అని రాసి ఉంది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.
కాగా, జాన్వీ కపూర్ గతేడాది 'దేవర'తో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. తొలి సినిమాతోనే హిట్ కూడా అందుకున్నారు. ఆ తర్వాత ఈ బ్యూటీ రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంలో అవకాశం దక్కించుకుంది.

# విశ్వంభర' ఫస్ట్ సింగిల్ వచ్చేసింది

**చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో 'విశ్వంభర'**
**'రామ రామ' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ విడుదల**
**పాటకు కీరవాణి బాణీలు.. రామజోగయ్యశాస్త్రి లిరిక్స్**

మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'విశ్వంభర'. తాజాగా ఈ సినిమా నుంచి 'రామ రామ' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ను మేకర్స్ విడుదల చేశారు. ఎం.ఎం. కీరవాణి బాణీలు సమకూర్చిన ఈ పాటకు సరస్వతిపుత్ర రామజోగయ్యశాస్త్రి లిరిక్స్ అందించారు. శంకర్ మహాదేవన్, లిప్సికా ఆలపించారు. పాట వినసొంపుగా ఉండి, శ్రోతలను ఆకట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. శ్రీరాముడి గొప్పతనం ఈ పాటలో వివరించారు. అలాగే చిరు కూడా తనదైన గ్రేస్‌తో పాటకు డ్యాన్స్ చేయడం చూస్తుంటే ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇక ఇప్పటికే విడుదలైన 'విశ్వంభర' టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'రామ రామ' పాట కూడా ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలను పెంచేసింది.






# 5 నిమిషాలకు రూ.కోటి తీసుకున్న తమన్నా!

**ఐటెం సాంగ్స్ తో ఇరగదీస్తున్న తమన్నా**
**'రైడ్ 2' సినిమాలో 'నషా' సాంగ్ తో మెరిసిన మిల్కీ బ్యూటీ**
**నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చిన సాంగ్**

మిల్కీ బ్యూటీ తమన్నా సక్సెస్ ఫుల్ గా తన కెరీర్ ను కొనసాగిస్తోంది. ముఖ్యంగా స్పెషల్ సాంగ్స్ లో మెరుస్తోంది. స్వతహాగా మంచి డ్యాన్సర్ అయిన తమన్నాకు... ఐటెం సాంగ్స్ లో వరుస ఆఫర్లు వస్తున్నాయి. తమ సినిమాలో తమన్నా సాంగ్ ఉంటే హిట్ అయినట్టేనని నిర్మాతలు, దర్శకులు భావిస్తున్నారు. బాలీవుడ్ లో అజయ్ దేవగన్, వాణి కపూర్ జంటగా తెరకెక్కిన 'రైడ్ 2' చిత్రంలో తమన్నా మరోసారి మెరిసింది. 'నషా' అనే స్పెషల్ సాంగ్ తో అలరించింది. నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సాంగ్ 24 గంటల్లోనే 12 మిలియన్ వ్యూస్ సాధించి యూట్యూబ్ లో టాప్ ట్రెండింగ్ లో ఉంది. ఈ పాట కోసం తమన్నా ఎంత రెమ్యునరేషన్ తీసుకుందనేది బాలీవుడ్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. 5 నిమిషాల ఈ పాట కోసం ఏకంగా రూ. 1 కోటి తీసుకుందని సమాచారం. కేవలం 5 నిమిషాల స్క్రీన్ ప్రెజెన్స్ కోసం తమన్నా ఈ రేంజ్ లో తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



# ఎన్టీఆర్‌తో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకున్నా.. హృతిక్ రోషన్

**హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న చిత్రం వార్-2**
**ముమ్మరంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు**
**ఆగస్టు 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్**

హృతిక్ రోషన్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'వార్ 2'. వార్-2 చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో హృతిక్ రోషన్ 'వార్ 2' గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ నటన గురించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. "ఎన్టీఆర్ అద్భుతమైన నటుడు. అతడితో కలిసి పనిచేయడం ఒక గొప్ప అనుభూతి. ఎన్టీఆర్ నటనకు నేను ఫిదా అయ్యాను. ముఖ్యంగా ఎన్టీఆర్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను" అని హృతిక్ అన్నారు. అంతేకాకుండా, వార్ కంటే 'వార్ 2' మరింత భారీగా ఉండబోతోందని తెలిపారు. 'వార్ 2'లో ఎన్టీఆర్ 'రా' ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో హృతిక్, ఎన్టీఆర్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. వీరిద్దరిపై ఒక ప్రత్యేక గీతం కూడా ఉంటుందని తెలుస్తోంది. దీనికి ప్రీతమ్ సంగీతం అందించారు.

# కేరళలో జైలర్-2 షూటింగ్

తమిళనటుడు రజినీకాంత్ నటిస్తున్న సినిమా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబోలో 2023 ఆగస్టు 10న విడుదలైన 'జైలర్' సినిమాకు ఇది సీక్వెల్. జైలర్‌లో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, సునీల్, రమ్యకృష్ణ, మీర్ణామీనన్, వినాయకన్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2' 2026 వేసవిలో విడుదల చేయటానికి మేకర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. కేరళలోని అథపాడిలో రజనీకాంత్, ఇతరులపై మేకర్లు ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దానికోసం ఇప్పటికే భారీ సెట్లను కూడా నిర్మించారు. మరో 10 నుంచి 20 రోజులపాటు ఈ ప్రాంతంలోనే షఉటింగ్ జరగనుంది. కేరళ షెడ్యూల్ ముగిసిన వెంటనే ఫిల్మ్ యూనిట్ చెన్నై రానుంది. రజినీకాంత్ ఫ్యామిలీ సీన్స్, తన మనవడు, రమ్యకృష్ణలపై ప్రస్తుతం షఉటింగ్ నడుస్తోంది.




TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339